# అశ్రువులే మిగిలాయి

రచన.
శ్రీ చిల్లా సత్యనారాయణ రెడ్డి

ప్రొద్దు వాలింది...సద్దు మణిగింది! చీకట్లు చిందాయి ...చిమ్మిన రక్తంలా!! మెరుస్తూనె వున్నాయ్ తారకలు...మిణుగురు పురుగుల్లా!!

కీచురాళ్ళ సవ్వడి విన్పిస్తూనే వుంది...కర్కశంగా! ...అంతలోనె చెట్ల ఆకుల గలగల...ఆ వెనక పక్షులు చేసే భయకలిత ... కలకల నిస్వనాలు!—క్షణంలోనె స్థానం ఆక్రమించిన నిశ్శబ్ధత రాజ్యమేల్తోంది!

అలారమ్ పీస్ చేసే 'టిక్ టిక్' ధ్వని స్పందించే నా హృదిలో...అలజడి రేకెత్తింపచేస్తూ...ఆవరించిన చీకట్లను చీల్చుకుని ఎవ్వరో ఒక్కొక్క మెట్టె దిగుతున్నట్టు, ఆ వెనక...ఏదో...జరగబోయే ప్రళయానికి సూచనలా...ప్రతిధ్వనిస్తోంటే ... ఆ . . . ఆభయానక దృశ్యానికి జరగబోయే పరిణామాన్ని, ఊహా మాత్రంగానే తల్చుకున్న...నా ఒళ్లు జల దరిస్తోంది! నా నరనరాల్లో వింత చైతన్యం కల్గుతోంది!

భయాందోళనలు సమ్మిళితమైన నాలో...క్షణక్షణానికి ఆరాటం అధికతరమే ఔతోంది! బాధా కలిత మానసం జ్వలితస్మృతుల మధ్య జ్వలనమై పోతోంది! తనువెల్లా కంపనం ఆరంభిస్తూంటే పెనుగాలికి ఊగిసలాడే మాధవీలతలా ... నిరాధారమైన దీపకళికలా ఉంది. నా పరిస్థితి!!

వ్యధను రగిల్చే హృది...అవ్యక్తం కాని ఆవేదన...అనుక్షణం వేధిస్తూనే ఉన్నాయ్ నన్ను! ఏవేవో అజ్ఞాత శక్తులు నాపై విజృంభింపదలచి తమ వైపు త్రిప్పుకొన జూస్తున్నాయ్! అడుగడుగునా అంతరాత్మ నా కెదురు తిరుగుతూనే ఉంది...నే చేసిన నేరాన్ని వ్రేలెత్తి చూపుతూ..! నన్ను శపిస్తూనె ఉంది...నా పాపానికి ప్రాయశ్చిత్తం అనుభవించ మంటూ...!! ఆ నిర్దేశానికి విముఖత చూపలేని నేను, కాతరఘోషకు...నిలువలేని వాణ్ణై...అయి నైరాశ్యవస్థను సమీపించాను. . . , ఎక్కడో కూసిన తీతువు కూతతో!!

నాగుండె ఏనాడో బండబారింది. నాలోని జాలి కరుణ అనె జీవాలు ఏనాడో హరించుకు పోయాయి! కనీసం—సాటి మానవున్ని మానవునిగా గుర్తించి గౌరవించే స్థితిలో లేను...నె నిప్పుడు! అయాచితంగానే జీవిస్తూ నైచ్యానికే ఒడిగట్టి పశుకృత్యానికే పాల్పడ్డాను, అధఃపతనానికే దిగజారిపోయాను. నా పాపానికి—నిష్కృతిలేదు నా ఆత్మకి శాంతిలేదు. నా కిక విముక్తి లేదు. జీవించి కూడా...మృత కల్పుడనే! యింకా...బ్రతుకు మీది పిపాస కొద్దీ జీవించాలంటే... కృళ్ళి కృళ్ళి క్రుగ్గి పోవాలి నరకయాతనల్ని అనుభవిస్తూ...! అంచేతే ... శాశ్వతంగా యీ లోకంనుంచి నిష్క్రమింప జూస్తున్నాను.

× × ×

యిప్పుడిప్పుడూ యిహానికి దూరమవ్వాల్న నేతపన, తప్ప పారిపోవాల్న నే వాంఛకల్గుతోంది నాలో! అలా కోరుకోవటంలో నా ఉద్దేశ్యం...నా చుట్టూ వ్యాపించి వున్న బాధల అగాధాల్ని అవలీలగా దాటెయ్యొచ్చనే ఆశే! అదే...ఆశ...మిణుకాడే ప్రమిదలా పిపాసను జనింపచేస్తోంది...నాలో!—ఏది ఏమైనా అంతరాంతరంలో ప్రతిబింబిచే తీవ్రతపనే!!

'నీవూ ఒక మనిషి వేనా?' అన్నట్టు...! అలారమ్ పీస్ ధ్వని ప్రతిధ్వనించి సూచిస్తోంది నాకు...మరణం ఆసన్నమౌతున్నట్టు...! నాగుండె అదురుతోంది...నాలోని భయానికి మల్లే!—కాలాన్ని వృధాపర్చక త్వరపడమని హెచ్చరిస్తోంది నా అంతరాత్మ! అందుకు వంత పాడుతోంది నా మేధస్సు!

గతం కదలి కనుల ముందర విన్యాసమాడ్తూంటే అనుభూతుల మధ్య అవలోకిస్తూ ఉండిపోయాను! గాఢ నిర్లిప్తతతో!!

× × ×

'మిష్టర్ రావ్!'

నిశ్శబ్దానికి ఒక్కంతట భంగపాటే! — అప్పుడే ఆఫీసులో అడుగిడిన రాజారావ్ గిరుక్కున వెనక్కు

తిరిగాడు. అది...ఆఫీసరు గొంతు !—ఆ స్వరంలోని కర్కశం అతణ్ణి యిట్టే నడిపించింది. ఛాంబర్ లోనికి !

'వై ఆర్ యూ లేట్???'

యిదీ మొదటి కళలప్రశ్న ! యెదురుగావున్న గోడ గడియారం వెకలిగా నవ్వుతూ ఠంగ్ న మ్రోగి పూరుకుంది...!!

అప్పటికిగాని తన తప్పు తెల్సుకోలేని 'రాజారావ్' మదిలో సంచలనం కలుగ నారంభించింది.

'మాట్లాడవేం'???—

రెట్టించిన అధికారం స్వరంలో కనవస్తూనేవుంది !

'సారీ సార్'—అని,

తలవంచుకున్నాడు రాజారావ్ !

'వ్వాట్??? నువ్వింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే కుదరదోయ్ మున్ముందు, మైండ్ దట్ !—ఆఫీసుకు పదిన్నరకు రావటం తెల్సుగాని, ఓగంట ఆలస్యంగా యింటికి వెళ్ళటానికైతే చచ్చి గింజుకుంటావు ఇక ముందు లేటుగా వచ్చావని తెల్సిందో...అబ్ సెంట్ మార్క్ చేసేస్తాను; తెల్సిందా?—యిక వెళ్ళు!' అని, హుంకరించాడు.

ఒక్కనిముషం ఆగాక, రెండడుగులు ముందుకు వేశాడో లేదో రాజారావ్, చివాలున వెనక్కి తిరిగాడు. ఆఫీసర్ పిలుపులో!

'ఆఁ—నిన్నె ! ఆసీట్లో శంకరం యీవాల్టినుండి పదిరోజులు సిక్ చేశాడు. వర్కంతా కవర్ చెయ్యి ఏ మాత్రం పెండింగ్ వున్నా ఊరుకునేది లేదు'—అని, ఏం? అన్నట్లు ప్రశ్నగా చూశాడతనివేపు.

'యస్ సర్'—అని మౌనంగానె వచ్చి తన సీట్లో కూలబడ్డాడు రాజారావ్!

చకా చకా వర్క్ పూర్తి చేసుకునేసరికి, మధ్యాహ్నం ఒంటి గంటయ్యింది. "ఆకలి దహిస్తోంది. యేమన్నా తినాలి" అనుకుంటూ కేంటీన్ కు దారితీశాడు. టిఫిన్ కాఫీ ముగించి వచ్చి ఛైర్ లో కూలబడ్డాడు యధావిధిగా!... యింతలో హెడ్ క్లర్క్ కలకంఠం పిలుపు వినవచ్చిందనికి! వినుక్కుంటూనె మెల్లిగా సమీపించాడతణ్ణి.

ఓసారి అపాదమస్తకం పరీక్షించిన మీదట "యిదిగో రావ్!"—మీరిలా వర్క్ వదిలేసి షికార్లు తిరిగితే లాభంలేదు. అసలు ఆఫీసుకు వచ్చింది మొదలు సాయంత్రం అయ్యిందాక, సీట్లోంచి కదల కూడదు తెల్సా?—మా పాతికేళ్ళ సర్వీసులోను మేం ఎప్పుడూ ఒక్క రిమార్కు తెచ్చుకోలేదు తెల్సా!—మీకు కాఫీ గట్రా కావలిస్తే ప్యూన్ చేత యిక్కడికే రప్పించుకుని పని పూర్తి చేయటానికి ప్రయత్నించండి. అసలు మీరు చేస్తున్న వర్కేవిటో నాకేం అర్ధంగావటంలేదు—అన్నాడు.

యిలా అన్నందుకు మరో విధంగా భావించకండి. "యింకా యంగ్ స్టేజ్ లో వున్నారు గనుకను... అదైనా చెప్పటం..." అని, అర్థోక్తిగా సర్దిచెప్పటం మొదలెట్టాడు.

దాంతో రాజారావ్ మనసు వికలమై, వెధవ్వుద్యోగంలో సెరక ప్రవేశించాన్రా దేవుడా అనుకుని తన పనిలో తాను నిమగ్నుడయ్యాడు.

రోజులు తరలే కొద్దీ అతని పరిస్థితి మరీ భారంగా ఆవహిస్తూనె వచ్చింది.

యింకో రోజున యేదో ఎక్కౌంట్ టాలీ చేస్తుండగా... ఆఫీసర్ పిలుపు విన్న రాజారావ్, అదిరిపడి యిట్టే ప్రవేశించాడు రూమ్ లోనికి!

అతను ప్రవేశించడమే తడవు—"ఏంవోయ్? పని చేయడానికి ఉద్దేశ్యం లేదా నీకు?—యిన్నేళ్ళబట్టి పని చేస్తున్నా యీ స్పెల్లింగ్ తప్పులేమిటి???—మరి యేం చదువు వెల్గబెట్టావని బి. ఏ. ప్యాసయ్యి??? అని, సాగదీశాడు.

"సారీ సార్ ఖంగారులో పొరపాటున వ్రాశాను"

"పొరపాటో గ్రహపాటో—అలవాటు చేసుకో మరి! యిలా అయితే ఉద్యోగానికి తిలోదకాలిచ్చుకోవల్సి వస్తుంది. ఆఁ...పైగా నిన్నరాత్రి ఏడింటికే కొంప మునిగినట్లు, ఆఫీసు వదిలావట దేనికి"???

"యింట్లో పనుండి వెళ్ళాను సార్!"

"యింట్లో పనులకోసం వచ్చావా లేక ఆఫీసు పని కోసం వచ్చావా యిక్కడకి??? యిల్లాంటి వేషాలు వేశావంటే యికముందు, డిస్ మిస్ చేసి పారేస్తాను. జాగ్రత! అని, అరిచాడు అవధులు మించిన కోపావేశంలో!

రోజులు గడుస్తున్న కొద్దీ రాజారావ్ పరిస్థితి మరీ

విషమించ సాగింది. ఆ విషపూరిత వాతావరణం అతన్ని అచ్చటనుండి దూరం చేయటానికే చూస్తోంది!

ఎంతపని చేస్తున్నా యీసడలింపులూ-విసుక్కోవడాలు తప్పటం లేదతనికి! అందరిలా "కాకా" బాపతి కానందువల్ల వచ్చిన చిక్కే అది! కానుకలూ - సమర్పణలూ చేసుకోనందుకు వచ్చిన అనర్థమే అది! అందునా యమ పాశంలా బిగించిన గురి వుంది కలకంఠంగారి దృష్టిలో! అతని నిఘాపడినవాడు నాశనం అయ్యి తీరాల్సిందే! అతనిచుట్టూ ఉద్యోగాలకోసం తిరిగేవాళ్ల బాపతి హెచ్చుగా వుంటాది. రాజారావ్ మీద ఓ సీత కన్ను వేయనె వేశాడు దొర!

యిదిట్లా వుండగా ఓరోజున ఆఫీసర్ ప్యూన్‌తో కబురంపించటంతో హడావుడిగా హాజరయ్యాడు రాజారావ్!

"ఏంవోయ్? పనిచేయడం కష్టంగా వున్నట్టుందే చూడగా... నీకు?"—అన్నాడు, భావగర్భితంగా!

"లేదు సార్," అని తలవంచుకున్నాడు రాజారావ్!

"మరి కాకుంటే ఏవిటి? - అంత నిర్లక్ష్యం కనబరుస్తుందేం నీ వ్యవహారం??? పెద్దల మాటంటే అంత పొసగటం లేదేవిటి... నీకు? మరీ... యింత పొగరు పనికిరాదోయ్!"—అంటూ అతనికేసి నిశితంగా చూడనారంభించాడు.

అతడంటున్న మాటలకు అర్థంగాక రాజారావ్ తెల్లపోయి డిల్లపడి పోయాడు. 'యిదేమిటి?.,.ఎన్నడూ తనెవ్వరికి ఎదురు చెప్పి ఎరుగడే.,,మరి యిదంతా చూస్తుంటే కలకంఠంగారి పన్నాగంలానే ఉందే' అని మనసులోనే మథనపడసాగాడు.

"యేం? ఏమిటా పరధ్యానం?" -

"యేం లేదు సార్"

"మరి..,ఆరోజు అదే.., నేను కేంపులో వున్నప్పుడు కలకంఠంగారు అర్జంట్ ఫైల్స్ యింటికి తీసుకెళ్లి వర్కవుట్ చేసుకురమ్మంటే తిరస్కరించావట ఎంచేత???

"లేదుసార్! అప్పటికే ఆఫీస్‌లో తొమ్మిదయ్యింది. మార్నాడు ఫస్ట్ అవర్‌లో ఫినిష్ చెయ్యొచ్చని చెప్పాను సార్!"

"ఆహా!,..అదిసరేగాని - మా అబ్బాయిని ఆరోజు హాస్పిటల్‌కు తీసుకెళ్ళమంటే—పనుందని తప్పించుకున్నావట దేనికని"???

అదే సమయానికి ఏదో ఫైలు తేటటానికి వచ్చిన కలకంఠం, అందుకున్నాడు పనిలోపని గదా అని!!

"అవును సార్! అందరి పన్లకీ కాకిలా తిరగటానికి నేనేం ఋణపడి వున్నానా అంటూ బెట్టుగా జవాబిచ్చాడు సార్,"

"ఆహాఁ! బెట్టుగా సమాధానం యిచ్చాడా... అయితే గుట్టు, చప్పుడు కాకుండా తీసి పారేస్తే సరి! తెగులు కుదురుతుంది"—అని తల పంకిస్తూ ఓరగా చూచాడు అతనివైపు!

"తీసి పారేసేటంత పొరపాటు పని యేం చేయలేదు సార్ నేను"

వ్హాట్! తప్పు చేయడం కాకుండా కప్పిపుచ్చడం కూడానా! గెటవ్!...యూ గెటవుట్ ఐస్సే!" - అని అరిచాడు కసిదీరా,..!

దాంతో రాజారావ్ అహం దెబ్బతింది. నిగ్రహించుకో జూశాడు కాని సాధ్యం కాలేదతకి ఆవేశంలో తనేమంటున్నాడో కూడా గ్రహించే స్థితిలో లేడతను.

"మీరేమంటున్నారో కొంచెం గుర్తుంచుకు మాట్లాడండి. అధికార మదంతో విఱ్ఱవీగి బలహీనుల్ని మరింత రెచ్చగొట్టకండి"—అన్నాడు.

దాంతో వళ్లు మండింది ఆఫీసర్‌కు! మాటలకు ప్రతిగా, రాతలలోనె చూపించాడు...తత్ఫలితం?— నిరుద్యోగి అయ్యాడు రాజారావ్!

× × ×

ఎక్కడో పిచ్చికుక్క బాధతో అరుస్తోంది కర్ణకఠోరంగా!--ఊహాంచల నివాసంలో విహరిస్తున్న రాజారావ్ ఉలిక్కి పడ్డాడు ఒక్కసారిగా---గుడ్లగూబ అరుపుతో!!

తనకు అన్యాయాన్ని మిగులుస్తూ పాతరోజులు పాతి పోయాయి....కాలచక్రపు పరిభ్రమణంతో పాటు!!--

ఆ రాజారావ్‌కి కూరు పేరే నేను!--ఉద్యోగంకోసం విశ్వప్రయత్నాలు చేసి, విసిగి వేసారిపోయాను. నా డిగ్రీని చూపించి యెందరిని యాచించానో నాకే తెలీదు.---ఆ దైవానికి కూడా నాపై దయకల్గ లేదు.

చదువుకున్న చదువుకి విలువనివ్వని ఈ రోజుల్లో, లంచాలకు - రికమండేషన్లకు ఆలవాలములయిన ఆ

ఉద్యోగాలు... నావంటివానికి లభించటం దుర్లభమే అయ్యింది...ఆకాశ కుసుమాన్ని ఆఘ్రాణించినట్లు!---పేరుకు మాత్రం కమిషన్లు పరీక్షలని పేరాసు చూపి, దేశాంతరాలు పిలిపించి, రిజల్ట్సు కోసరం వేచి వుండమంటారు. యీలోపుగా పచ్చకాయితాలు నివేదించుకున్న మహనీయులకే సాదరంగా ఆహ్వానిస్తారు.---లోకంతీరే అంత! మారే కాలంతో పాటు లోకంకూడా మారదెందుకు?---అదే నాలోని తీరని చిక్కు ప్రశ్న!

ఉదర పోషణకై ఎన్నెన్నో అల్పవృత్తులకు ప్రాకులాడి చివరికి అప్రయోజకుణ్ణే అయ్యాను. ఈ వంచనాపూరిత సమాజం నన్ను వెలివేసింది. అయినా లెక్కచేయలేదు నేను---తాటాకుల చప్పుళ్లకి బెదిరేవి కుందేళ్ళే కాని...నేను కాదు!—అదే నా మనోరథం! అదే నా ధృఢ సంకల్పం!!

ప్రకృతి చేసే పరిహాసానికి నేనే కాక, నన్ను కని, పెంచి, పెద్దచేసిన నా మాతృమూర్తి; జ్ఞానమెరుగని నా చిన్నారి సహోదరుడు విపరీత అనర్థాలకు గురి కావలసి వచ్చింది. విధివైపరీత్యమే అనాలి మరి! పస్తులే యెరుగని మా కుటుంబం కన్నీటిని దిగమ్రింగి, ఆకలిని సహితం సహించింది! బాధ లెరుగని మేము లేని ఓర్పునూ, సహనాన్ని తెచ్చి పెట్టుకుంటూ బ్రతగ్గలిగాం!!

పుట్టుకతోనే తండ్రి ఆదరాన్ని నోచుకోనని నేను-పెంచి, పెద్ద చేసిన మాతృమూర్తిని సుఖపెట్టలేకపోయాను. నా చిన్నారి 'చిట్టి' భవిష్యత్తును తీర్చి దిద్దలేకపోయాను. వారియువుని పట్ల.....నా కర్తవ్యాన్ని, బాధ్యతల్ని నెరవేర్చుకోలేకపోయాను—అదే సమస్య అనుక్షణమూ నాహృదిని రగిల్చి వేస్తోంది! అదేబాధ... వేయి జ్వాలా స్ఫులింగాలై నా మదిని పగిల్చి వేస్తోంది! దహించే ఆకలి నా నరనరాల్ని కృశింపచేస్తోంది! శుష్కించిన నా శరీరం క్రోధాగ్నిలో జ్వలించి పోతోంది! నా...బ్రతుకే నాశనమయ్యింది. మా అందరి బ్రతుకులే అథఃపతనానికి దిగజారిపోయాయి!

ఆక్రోషించిన నా హృదిలో ఆరాటం తగ్గింది' కలత చారిన నామది కుదుటబడింది! యిక...కొద్ది క్షణాల్లో తల్చుకుంటేనే నాగుండెల విసిపోతున్నాయి·

బ్రతికివుండి వారి బాధల్ని కళ్ళారా చూడలేను. వారి శాపాగ్నికి బలికాలేను. అందుకు...నన్ను...నేనే బలిచేసుకుంటున్నాను...ప్రాయశ్చిత్తంగా! అంతటితో గాని, నా ఆత్మకి శాంతి లభించదు. నాలోని అగ్ని శిఖలు చల్లారవు! కాని...నే చేసే యీ అఘాయిత్యానికి యెందరిని బలిచేస్తున్నానో, అనేదే నాలోని తెరని ఆవేదన! కాని ... చావలేక బ్రతకలేను. బ్రతకలేకే ఛస్తున్నాను!—నిస్సహాయుణ్ణి!!

............అబ్బా..............అః.......!!?

× × ×

తలుపులు బ్రద్దలు చేసుకుని లోనికి ప్రవేశించిన యిన్స్పెక్టర్ 'సదానంద్'—నివ్వెర పోయాడు. శవం ప్రక్కనె పడివున్న ఉత్తరాన్ని చదివి!!---అప్పుడే ముగించిన అతడు గాఢమైన నిట్టూర్పుని విడిచాడు!--సరిగ్గా అదే సమయానికి గోడగడియారం ఘొల్లున పన్నెండుసార్లు ఘోషించగా ఉలిక్కిపడిన యిన్స్పెక్టర్ తలయెత్తి చూసేసరికి---యెదురుగా కన్పించింది ఒక ప్రేత నీడ.

(శ్రీ సత్యమాంబాదేవి పదపద్మాలకు అంకితం!!)

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond 1898 1958 Jubilee
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.